బస్సుకు పంపారు. ఎలాగూ ఈ వూరు కొచ్చాను కదా నా కొలువు సంగతి చూసుకుపోదామని వచ్చాను ఈ ఆఫీసుకు... ఏంటో! పదోతరగతి వరకు చదివిన నాకే యిలా వుంటే పెద్ద డిగ్రీలు చదివినవాళ్ళు నా మాదిరే ఈ బండరాళ్ళమీద చతికిలబడి బ్రతుకుతెరువు కోసం వెంపరు లాడుతూంటే నాకెంతో బాధగా వుంది... అవును .. మంది ఎక్కువయ్యారు... చదువులు ఎక్కువయ్యాయి .. ఉద్యోగాలు తక్కువయ్యాయి మరి... రాతిబెంచీ వేడెక్కడం మొదలయ్యింది. . లేచి ముంగాళ్ళమీద కూచున్నాను.

"అన్నా! అగ్గి పెట్టెస్తావూ.. "

తిరిగిచూశాను .ఓ పాతికేళ్ళ యువకుడు . నా గడ్డంకన్నా అతడి గడ్డం బాగా పెరిగింది లోతుకళ్ళు ముఖం పీక్కుపోయింది . జేబు లోంచి అగ్గిపెట్టె తీసిచ్చాను. ఒక్క పుల్లతో సిగరెట్ వెలిగించాడు... గుప్పున పొగ వదిలి అగ్గిపెట్టె తిరిగియిస్తూ 'థ్యాంక్స్' అన్నాడు నాకు ఏం చెప్పాలో తెలియక ఓ చిరునవ్వు విసిరాను

"ఇంకా ఆఫీసోళ్లు రాలేదా ?" అంటూ అడిగాను.

"వస్తారు...వస్తారు . తీరుబడిగా . ! తినేది అరగాలిగా ! !"

మౌనంగా వుండిపోయాను

"ఏ వూరేంటి మనది ?"

"చెప్పాను. పేరు, చదువు గురించి కూడా చెప్పాను"

"రిజిష్టరు చేసి ఎన్నేళ్లయింది ?"

"ఆరేళ్లు ..ఒక్క 'కాలై'నా రాలేదు"

"ఎందుకొస్తుంది చేతులు తడప గూడదూ"

వెంటనే అర్థంకాలేదు. అర్థమయ్యేలోపుగా తనే నవ్వేశాడు.

"బొగ్గు బావుల్లో వుద్యోగాలు కుప్ప లున్నాయి పైరవికారు చేతుల్లోబడి అమ్ముడు బోతున్నాయి. నీవు కూడ ప్రయత్నించు అది గదిగో బండి 'సైట్' అయింది పంతులు గారొస్తున్నారు" అంటూ ఆ యువకుడు ముందుకు వెళ్లిపోయాడు

పంతులుగారంటే ఆ ఆఫీసులో హెడ్ గుమాస్తా. బరువు పెట్టందే ఏ పని చేయడని ప్రతీతి. కాంపౌండులోకి స్కూటరొస్తూనే అందరూ లేచి నిలబడ్డారు. స్కూటర్ కు స్టాండేసి అటు యిటూ చూసి అందరి నమస్కారాలు అందుకొని, అదో రాచ ఠీవిగా ఆఫీసు తలుపు వైపు నడిచాడు పంతులుగారు.

అంతవరకు ఎక్కడున్నాడో, ఏడనున్నాడో గాని, ఆఫీసు బంట్రోతు మోహనరావు పరుగున వచ్చి పంతులుగారి దగ్గర నుండి తాళాలు అందు కుని, ఆఫీసు ద్వారాలు తెరిచాడు.

అంతవరకు పంతులుగారు ఆఫీసు మెట్ల మీద నిలబడ్డాడు. మేమందరం వెళ్ళి అతడి చుట్టూ నిలబడ్డాం పంతులుగారు సిగరెట్ వెలిగించాడు. బుగ్గన కారాకిళ్ళీ 'టైం' చూసుకున్నాడు. చిరాగ్గా ముఖం పెట్టాడు ఇంతలో యింకో స్కూటర్ పై రజాక్ ఆలీ వచ్చాడు పంతులుగారికి నమస్కారం పెట్టి ఆఫీసులోని కెళ్ళిపోయాడు. అతడు ఓ గుమాస్తాయే.. పంతులుగారికి కుడి భుజమూనూ ఎడమభుజం భజగోవిందం యింకా రాలేదు మరి పంతులుగారిలో సహనం చచ్చిపోయేట్టుగా వుంది 'పంక్చుయాలిటీ' అంటే తెలియని వెధవలు అంటూ ఏదో తనలో తిట్టుకుంటూ ఒక్కసారిగా మావైపు చూశాడు కోపంతో వణికిపోయాడు

"ఏంటయ్యా! నా చుట్టూ చేరారు ఇక్కడేం బొమ్మలాడుతున్నారా 'లైను' కట్టండీ గుమాస్తాగారొస్తారు" అంటూ ఆఫీసులోని కెళ్ళిపోయారు గుంపు చెల్లాచెదరయి పోయింది "క్యూ"లు తయారయాయి. ఓ జావా మోటర్ సైకిల్ పెద్ద చప్పుడుతో కాంపౌండులోనికి దూకింది దానిమీద భజగోవిందం వున్నాడు నాకు అతడితోనే పని ముందుకెళ్ళి నమస్కారం చేశాను నా చుట్టూ ఓ ఇరవైమందిదాకా వుండి భజగోవిందంగారికి నమస్కారాలు పెడ్తూ దారి తొలగారు అందరి నమస్కారాలు అందుకుంటూ అతడుకూడా ఆఫీసులోని కెళ్ళిపోయాడు

ఓ పాతసైకిల్ మీద ఆ కేంద్రపు అధికారి గారొచ్చారు ముఖంలో బీదతనం వుట్టిపడు తోంది తప్పదన్నట్టుగా మా నమస్కారాల్ని అందుకున్నారు.

'సీరియస్'గా తనగదిలోనికి వెళ్ళిపోయారు పాపం . బ్రతకనేర్చినవాడు కాదట . నిజాయితీ పరుడట మరి . అందుకనే ఆ డొక్కు సైకిలూ . ఆ వేషధారణానూ

భజగోవిందంగారు తన 'సీటు' సర్దుకొనే సరికి యింకో అరగంటయ్యింది

ఎదురుగా నిలబడ్డాను నమస్కారం పెట్టాను

ఏం కావాలన్నట్టు చూస్తూనే, టేబిల్ మీదనుండి ఏదో ఫైల్ చేతిలోకి తీసుకొన్నారు భజగోవిందంగారు

"సార్! ఇంతవరకు 'కాల్' రాలేదు"

"అయితే నన్నేం జేయమంటావ్ ?"

"కాల్ లెటరూ పంపకూడదటండీ"

"ఎన్నేళ్లయింది రిజిస్టర్ చేసి . ?"

"ఆరు సంవత్సరాలు దాటాయ్యండి ?"

"చూడు బాబూ! నీకన్నా రెండు, మూడేళ్ళు ముందుచేసిన వారున్నారు. వాళ్ళకే అతీగతీ లేదు. వెళ్ళెళ్ళు... ఖాళీలంటూ వుంటే అదీగాక నీవరకు వస్తే తప్పక పంపుతాం. మాదేం పోయిందయ్యా! చూడు బాబూ! బయట ఎంతోమంది పెద్ద పెద్ద డిగ్రీలున్నవారే పడిగాపులు కాస్తున్నారు వాళ్ళముందు నీ వెంత ?"

"నిజమేనండీ! నాకు పెద్ద వుద్యోగాలు అవసరం లేదండీ ఏదో పొట్టపోసుకోటానికి చిన్న వుద్యోగం చాలండీ"

"చిన్న వుద్యోగాలయితే రప్పున దొరుకు తాయనుకుంటున్నావా ?"

"అబ్బే! లేదండీ!! మీ దయ వుంటే" అంటు నసిగాను చేతులుకూడ నలుపుకున్నాను

"అవునూ! ప్రతి మూణ్నెళ్లకోసారి నిన్ను చూస్తూనే వున్నాను"

"అవున్సార్! పిల్లలుగలవాణ్ణి బొగ్గు బావుల్లో ఏవో వుద్యోగాలున్నాయంటున్నారు దయచేసి నా పేరు పంపండి మీ రుణం"

"రుణం వుంచుకోనంటావ్ ?"

"అవున్సార్!!"

"తప్పదంటున్నావ్ ? మరెలాగయ్యా బాబూ! అవునూ! నీ పేరు నెంబరు చెప్పు చూద్దాం !!"

భజగోవిందంగారు మాంచి 'హుషారు'లో వున్నారు చేతిలోని ఫైలు మూసి పక్కన బెట్టి, కుర్చీలోంచి లేచి, ఓ చెక్క అల్మారా లోంచి ఓ కట్ట తీశారు అందులో రికార్డు లాంటిది బయటకు లాగారు ఒక్కసారిగా ఆశ్చర్యపోయినట్లు నా వైపు చూశాడు

"అదేంటయ్యా! మూణ్నెళ్ల క్రితమే బొగ్గుబావుల పనిలోనికి నీ పేరు పంపారు అయితే నీకు "కాల్ లెటరు" రాలేదంటావ్ ? ఉండుండు అదేంటి ? నీవు వుద్యోగంలో చేరినట్టుకూడ ఆ ఆఫీసునుండి మాకు వుత్తరం కూడ వచ్చింది"

"సరిగ్గా చూడండి సార్! అది నాది కాదేమో!"

మళ్ళీ 'చెక్' చేశాడు నాకు మూణ్నెళ్ల క్రితమే "కాల్ లెటర్" పంపినట్లు నిర్ధారణ చేశాడు భజగోవిందంగారు

నాకు ఒక్కసారిగా తెలివితప్పినట్లయింది తమాయించుకున్నాను నా పేరుమీదుగా యింకొకరు వుద్యోగం చేయడమా ? నమ్మడానికి వీల్లేకపోతోంది

"అదేంటో కనుక్కోవయ్యా బాబూ! బొగ్గు బావుల్లో యిలాంటి మోసాలు తరుచు జరుగుతున్నాయని మేమూ వింటున్నాం నీవు యింకెళ్ళొచ్చు" అంటూ భజగోవిందంగారు నన్ను వెళ్లమన్నట్టు సైగ చేశాడు తలుపు దాటుతున్నానో లేదో మళ్ళీ పిలిచారు సిగరెట్లు నిండుకున్నాయని ఓ 'రెడ్ విల్స్ సిగరెట్ ప్యాకెట్' తెచ్చి పెట్టమని ఆర్డరేశాడు తన జేబుల్లోంచి డబ్బులిస్తాడేమోనని ఓ రెండు నిముషాలు కాచు కున్నాను. ఊహూ! ఇవ్వడే!! ఫైళ్ళల్లోకి మునిగిపోయినట్లు నటించాడు నేను బయటికి నడిచి బడ్డీకొట్లో సిగరెట్ ప్యాకెట్టు, ఓ

అగ్గిపెట్టె కూడ కొని, భజగోవిందంగారికి సమర్పించాను పోనీ యీ చిన్న రుణం తీర్చుకున్నాననిపించింది. బొగ్గు బావుల వుద్యోగానికి నా పేరు ఎప్పుడు పంపారో తదితర విషయాలన్నీ ఓకాయితంమీద రాయించుకొన్నాను గేటు దాటుతూంటే "అన్నా! ఓ అగ్గిపుల్లిస్తావూ!!" అంటూ వినపడింది. మళ్ళీ ఆ గుబురు గడ్డం యువకుడే! అగ్గిపెట్టెయిచ్చాను ఈసారి మూడోపుల్లతోగాని సగం కాలిన సిగరెట్టుని వెలిగించలేకపోయాడు

"ఏమయ్యింది?"

విషయం చెప్పాను.

అతను ఆదోరకంగా నవ్వాడు

"ఇందాక నే చెప్పలే! బొగ్గు బావుల్లో వుద్యోగాలు కుప్పలున్నాయని! ఏంలేదన్నా! ఈ ఎంప్లాయిమెంట్ ఆఫీసోళ్ళు, పైరవీకార్లు, కుమ్మక్కయి మనలాంటోళ్ళ దగ్గర వేలకువేలు గుంజి, ఎవరి పేరుమీదుగానో వుద్యోగాలు యిప్పిస్తున్నారు బొగ్గుబావుల అధికార్లక్కూడ యిందులో భాగముందనుకో? అంటే నీ పేరు మీదుగా ఇంకొకడు వుద్యోగం చేస్తున్నాడన్న మాట అయితే నీకీ జన్మకు వుద్యోగం అంటూ రాదు అన్నా! ఓ సిగరెట్టివ్వవా"

సిగరెట్టిచ్చాను తీసుకొని భద్రంగా జేబులో పెట్టుకొన్నాడు యువకుడు

# ఫిర్యాదు

"అన్నా! నన్నేం జేయమంటావ్?" అంటూ అడిగాను దిగాలుగా

"నీకు దమ్ములుంటే బొగ్గు బావు కాడికెళ్ళి కనుక్కో? ఆ పైన గవర్నమెంటోళ్ళకి ఫిర్యాదుచేయి. ఓకే! వస్తానన్నా!!" అంటూ ఆ యువకుడు, నా దగ్గర్నించి కదలబోయాడు.

"అన్నా! నీ పేరు?"

"నా పేరు జాన్ రిచర్డ్స్. బి ఎస్సి పాసయినాను! ఎనిమిదేళ్ళ క్రింద రిజిస్ట్రేషన్ చేశా! ఎన్నో 'కాల్స్' వచ్చాయి. ఏం లాభం! మనం సెలెక్ట్ అయ్యే అవకాశంలేదు. ఉత్తరాయణం, దక్షిణాయణం నిల్! వస్తా!!" అంటూ వడి, వడిగా అక్కణ్ణించి కదిలిపోయాడు

అవునూ. ఇల్లాంటి యువకుడికి "గవర్నమెంటు" మీద ఎంతో నమ్మకమున్నట్లుంది లేపోతే నా వుద్యోగ విషయమై ఫిర్యాదుచేయమని చెప్పడు. అయినా ఫిర్యాదు అందుకొని గవర్నమెంటోళ్ళు ఏం చేస్తారు? చించి అవతల పారేస్తారు అవినీతి అంచున అందరూ అందరే మరీ!

ప్రస్తుతం నేనేంచేయాలి? మనస్సంతా ముసురుపట్టినట్లుంది బస్టాండు వైపు వేగంగా అడుగులేస్తున్నాను బస్సుకుటైమయిపోయింది

నేను పదవతరగతి పాసవుతూనే చదువు ఆపేయాల్సి వచ్చింది నాన్న పున్నపళాన గుండె నొప్పితో చచ్చాడు ఆర్థికంగా వెనకబడ్డ వాళ్ళం పై చదువులకు నోచుకోలేకపోయాం మా అమ్మ ఆరోగ్యం కూడ చెదలు పట్టిన ఎండిన తుమ్మచెట్టులాంటిది ఏ గాలి వచ్చినా రప్పన విరిగి పడుతుంది ఆ దెబ్బలోనే చదువు ముగిసింది అమ్మకు సాయంగా వుండాలని నాకు పెళ్ళి కూడా చేశారు ఏదో వున్న రెండెకరాల భూమి బువ్వ పెటోంది మరో ఐదేళ్ళలో ముగ్గురు పిల్లలు కాపురం సజావుగా నడవటంలేదు అన్నిటికీ కష్టంగానే వుంది ఎందుకైనా మంచిదని, అందులో కరణంగారు చెప్తే జిల్లా ఉపాధికల్పనా కేంద్రంలో నా పేరును నిరుద్యోగిగా రిజిస్టరు చేయించాను అయినా యింతవరకు ఒక్కసారికూడ 'పిలుపు' రాలేదు మా పల్లెకు, యీ జిల్లాకేంద్రం పదిమైళ్ళలో వుంది అందుకని ప్రతి రెణ్ణెల్లకో, మూణ్ణెల్లకో వచ్చినప్పుడు నా వుద్యోగం గురించి కనుక్కుంటూనే వున్నాను ప్రతిసారీ నాకన్న ముందు నమోదు చేసినవాళ్ళకే యింకా మోక్షం రాలేదని, ఖాళీలంటూ వస్తే తప్పక పిలుస్తామని చెప్తూనే వున్నారు ఆఫీసువాళ్ళు ఓ రెండుసార్లు


## తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను నిముక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారానికై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి

## దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించలేక పోతున్నారా అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి

## తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టుకు డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది ఇది మెదడుకు చల్లదనిస్తుంది ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం

**SHYAM AYURVED BHAVAN (AP)**
***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***



## రు. 40,000 విలువచేసే బహుమతులు గెలవండి.


1వ బహుమతి ఎజ్డీ మోటార్ సైకిల్ లేదా రు 13 000 నగదు
రెండవ బహుమతులు కలర్ టీవీ లేదా రు 9,000 నగదు
మూడవ బహుమతులు ● మూడు స్పీడ్ల మిక్సర్ కమ్ గ్రైండర్లు తగ్గింపు ధర రు 500/ OR
● రెండు స్పీడ్ల మిక్సర్ కమ్ గ్రైండర్లు తగ్గింపు ధర రు 325/-
● రెండు బ్యాండ్ల ట్రాన్సిస్టర్లు తగ్గింపు ధర రు 225/-
TAPE RECORDER




ఇది చెయిన్ లింక్ పథకం క్రింద అమ్మకాలను పెంచేందుకు ఉద్దేశించిన పథకం
ఈ క్రింద మూడు వరుసల్లో, ఏ పక్కనుంచి కూడినా 57 వచ్చే విధంగా 15 నుంచి 23 వరకే అంకెలను వాడేం
$18 + 23 + 16 = 57$ ఉదాహరణకు
17 19 21
22 15 20
మీరు చేయవలసిందల్లా ఇదే విధంగా ఎటు చూసినా 60 వచ్చే విధంగా మూడు వరుసల్లో 16 నుంచి 24 వరకూ అంకెలను వాడాలి

మీ ఎంట్రీలను, తెల్లకాగితం పైన, లేదా పోస్ట్ కార్డు పైన ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రం వ్రాసి 15 రోజులలోగా పంపించండి ఎక్కువ మంది ఎవరిని ఎంపిక చేసుకుంటారో దానిని బట్టి కరెక్టు పరిష్కారాన్ని నిర్ధారిస్తాము ఆ వారంలో అందిన కరెక్టు ఎంట్రీలు ఆధారంగా ప్రతి వారం తగ్గింపు ధరలకు బహుమతులను యిస్తారు విజేతలకు పోస్ట్ ద్వారా తెలియబరుస్తారు జడ్జి నిర్ణయం తుది నిర్ణయం అన్ని వివాదాలు ఢిల్లీ న్యాయస్థానాల పరిధికి లోబడి ఉంటాయి

**PRIMIER ELECTRONICS (TEL)**
**POST BOX NO 2715, KAROL BAGH, NEW DELHI-5**




ఆఫీసరును కలిసి నా బాధలన్నీ చెప్పుకున్నాను ఓపిగ్గా విన్నాడేకాని ఏ సాయమూ చేయలేక పోయాడు ప్రస్తుతం నాకు వుద్యోగం అవసరం ఇన్నాళ్ళు నేను ఉద్యోగం లేకపోయినా బ్రతగ్గలిగాను కాని మూడేళ్ళనుంచి కరువు వానచుక్క లేదు . పొలాలు ఎండిపోయాయి తాగటానికి మంచినీళ్ళే కాదు తింటానికి గింజకూడ దొరకని పరిస్థితి ఏర్పడింది ఈనాడో, రేపో రాలిపోయే అమ్మ ఉన్నవాళ్ళిళ్ళల్లో ఏవో పనులంటూ చేస్తూ కృంగిపోతున్న మా ఆవిడ, చదువు సంధ్యల్లేక, సమయానికి యింత తిండిలేక పాడవుతున్న పిల్లలు.. చాల బారంగా వుంది నా బతుకు . ఏ మునసబో, కరణమో, తదితరుల మోచేతి క్రింద నీళ్ళు తాగుతూ, వాళ్ళు చెప్పిన పనులనూ చేస్తూ, వాళ్ళిచ్చిన రూకలతో సంసారాన్ని యీదడమంటే నాకు చాల బాధగా వుంది ఏది ఏమైనాసరే! తను వుద్యోగం సంపాదించు కోవాలి సంసారాన్ని సుఖంగా నడపాలి అనుకుంటూన్న నాకు, భజగోవిందం అసలు సంగతి చెప్పాక ఒంట్లో నరాలన్నీ పట్టుతప్పాయి అయినా! నేనో నిర్ణయానికొచ్చేశాను వెంటనే నా పేరుతో ఎవరు వుద్యోగం చేస్తున్నారు? ఎలా సంపాదించారు?? వివరాలన్నీ కనుక్కోవాల ఆ పిమ్మట ఏది ఎలా జరుగుతుందో? చూడాలి

బస్టాండు చేరుకున్నాను బస్సు నిండుగా జనం ఇంకో పదినిముషాలకుగాని బస్సు బయల్దేర లేదు

ఊరు చేరుకున్నాను కరణంగారింట్లో మందులు అప్పచెప్పాను ప్రతిఫలంగా కరణం గారు ఓ అయిదు రూపాయలిచ్చారు ఇంటి కెళ్లాను అదేపరిస్థితి . చూస్తూనే నా ఉద్యోగం గురించి మరింత పట్టుదల పెరిగింది నాలో ఆ రోజు గడిచిపోయింది.

*   *   *

ఉదయం బస్సులో బయల్దేరి బొగ్గు బావు లుండే వూరు చేరుకున్నాను మా పల్లెకు నలభై మైళ్ల దూరంలో వుంది యీ వూరు ఊరంతా బొగ్గు పొగలతో నిండి వుంది. మంచు బట్టినట్లు, కమురు వాసన రోడ్లన్నీ అసహ్యంగా కంపు కొడుతున్నాయి ప్రతి వీధికి ఓ నాలుగైదు బ్రాందీ షాపులు ఊరి నిండా జనం. ఊరంతా ఎంతో సందడిగాను, అలజడిగాను వుంది ఓ 'హోటల్' కెళ్లి ఓ ప్లేటు యిడ్లీ, కాఫీ పుచ్చు కున్నాను మధ్యాహ్నం భోజనం తప్పిపోవచ్చు నా ఆర్థిక దృష్ట్యా . ఇక పరిశోధన మొదలెట్టాను అప్పుడు మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యింది ఎండ వుధృతంగా కాస్తోంది 'ఏజెంటు' ఆఫీసు కెళ్లాలన్నారు కొంతమంది అక్కడి కెళ్లేసరికి ఇంకో అరగంట గడిచింది

''నమస్కారం సార్ !''

ఎంతో ఓపిగ్గా తలెత్తి చూశాడాతడు

''రాజిరెడ్డి అని మా వూణ్ణుంచి వచ్చి బొగ్గు బావుల్లో పంజేస్తున్నాడు మా బామ్మర్ది సార్! అతనెక్కడుంటాడో చెప్తారా సార్ !''

మా ఊరికి టికెట్టివ్వమని అడిగినట్లుంది స్టేషన్ మాస్టర్ని ఓ ప్రయాణికుడు

''అవును నేనే రాజిరెడ్డి ఏం కావాలి?''

చచ్చాం ఫో! బామ్మర్ది అనేది వినబడినట్లు లేదు రక్షించాడు గురుడు, మళ్ళీ చెప్పాను అంతా విన్నాడు

''చూడు తమ్ముడూ! ఈ బొగ్గు బావుల్లో ఏభైవేల మంది పంజేస్తున్నారు ఈ ఆఫీసులోనే ఓ పదిమంది దాకా రాజిరెడ్డి లున్నారు ఇక్కడేం లాభం లేదు గాని ఏ బొగ్గు బావి కాడికోవెళ్ళి కనుక్కో తెలవచ్చు''

నేను అక్కణ్ణించి కదిలి ప్రక్కగదిలోని కెళ్ళి రాజిరెడ్డి గురించి వాకబు చేశాను ''అవును నా పేరే రాజిరెడ్డి.'' ఏం కావాల న్నాడు యింకో పెద్దమనిషి . ఈ రాజిరెడ్లం దరూ పెద్ద పెద్ద చదువులు చదివి, కుర్చీల మీద కూచుని, నెత్తిన ఫాన్లు వుంచుకొన్న వారే. వీళ్ళతో లాభం లేదు నాక్కావాల్సింది, భూపాంగాలకెళ్ళి గునపపు పోటుతో బొగ్గును వెలికితీసే కార్మికుడు. ఆడే నా పేరుతో కొలువు చేస్తున్న మరో రాజిరెడ్డి

బొగ్గు బావులు ఓ ఇరవై దాకా వున్నాయట రాజిరెడ్డి గురించి ఆరాతీయడ మెలా? అవును . ఏజెంటు ఆఫీసులోనే నా పేరు చెప్పి, నా పేరు మీదుగా యింకో రాజిరెడ్డి వుద్యోగం చేస్తున్నాడని ఫిర్యాదు చేస్తే? మరి ఏజెంటు ఆఫీసు వాళ్ళక్కూడ యిందులో ఏమైన పాత్ర వుంటే ఫిర్యాదు బుట్ట దాఖలవు తుంది ముందు ఆ రాజిరెడ్డి ఎవ్వడో కనుక్కో వాలి? అక్కణ్ణుంచే నరుక్కురావాలి?

మధ్యాహ్నం రెండు గంటలయ్యింది ఎండతో వూరంతా వుడికిపోతోంది ముందుగా దగ్గిరున్న ఓ బావి దగ్గరకు బయల్దేరాను మా వూరి సోమిరెడ్డి చిన్నల్లుడు గూడ ఎక్కడో యిక్కడే అంటే బొగ్గు బావుల్లోనే పంజే స్తుండాలి? వచ్చేటప్పుడు అతడి అడ్రసు తీసు కొచ్చింటే బావుండేది హడావుడిగా బయల్దేరటం వల్ల మరిచిపోయాను ఇంకో అరగంటలో ఆ బొగ్గుబావి చేరుకున్నాను అబ్బా! ఎంత విచిత్రంగా వుందా వాతావరణం బొగ్గురసి, ధూళి ఆప్రదేశ మంతా నల్లటి బొగ్గుతోనే కప్పబడినట్లుంది కార్మికులు బొగ్గు నుసితో నిండిన బట్టలు తలమీద హెల్మెట్లు రక్తం ధారవోసి ఎంతో శ్రమించి ఎన్నో మైళ్ళు భూమిలోనికి వెళ్ళి, బొగ్గు గడ్డలను తవ్వి బయటకు చేరవేస్తున్న ఆ శ్రామికుల్ని చూస్తూంటే నాకెంతో ఆనం దంగా వుంది కొద్దిసేపు నేనుకూడ వాళ్ళల్లో ఒకడిగా వూహించుకుని సంబరపడ్డాను . అక్కడున్న ఆఫీసుకెళ్ళాను రాజిరెడ్డి గురించి అడిగాను తెలియదని చెప్పారు ఆ ఆఫీసు వాళ్ళు ఏజెంటు ఆఫీసులోవున్న 'పర్సనల్ డిపార్ట్‌మెంటు' వారయితే చెప్పగలుగుతారని అక్కడికే వెళ్ళమని చెప్పారు నాకేం చేయాలో తెలియడంలేదు . అప్పటికే మధ్యాహ్నం మూడు దాటింది ఆకలేస్తోంది . అక్కడేవున్న చిన్న క్యాంటిన్లో ఓ బన్నురొట్టె, టీ పుచ్చుకుని

## వర్తక సోదరులకు

మీకు సేల్సుటాక్సు, ఇన్‌కంటాక్సు గురించి తెలిసినా, మీరింకా వాటిని గురించి తెలుసుకోవలసిన అనేక వేల విషయాలు, జాగ్రత్తలు, పొందేరాయితీలు ఎన్నోఉన్నాయి మీకుపయోగించే, సేల్సుటాక్సు పుస్తకం, ఇన్‌కంటాక్సు పుస్తకం, నేటివరకు వచ్చిన అన్నిమార్పులతో అడ్వకేటు మూర్తి అందరికి సులభంగా అర్థం అయేలా తెలుగులో రచించారు ఒక్కో పుస్తకంధర రూ 25/- పోష్టేజీ రూ 7/- అదనం ఈ రెండూ ఒకేసారి కొంటే పోష్టేజీతో సహా రూ 50/-లకే వి పి పోష్టుద్వారా పంపబడును ఇవి మీరు చదవటం వల్ల మీ టాక్సు సమస్యలు మీరే పరిష్కరించుకోగల సామర్థ్యం రావటమేగాక, ఇతరులకూ సరియైన సలహాలు యివ్వగలుగుతారు దేశ సేవ ప్రచురణలు, నెం 2 ఇందిరానగరు, వెంగళరావునగరు టాంకుసమీపాన, హైదరాబాదు-500 890 కు ఉత్తరం వ్రాసి వాటిని పొందండి





నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు

"క్యాంపులు" — ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం నుండి సాయంత్రం 6—30 గం వరకు ప్రతినెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం నుండి రాత్రి 9 గం వరకు

**డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్,**

సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్, పార్కురోడ్, *గుడివాడ*-521 301 ★ ఫోన్స్ 522 & 540






ఎ.జిస్

**రింగ్ సోలిన్**




తామర, చిడుము మరియు ఎగ్జిమా

మున్నగు చర్మవ్యాధులకు శ్రేష్ఠమైనది

**SAGSONS CHEMICAL CO.,**
MADRAS-81


# ఫిర్యాదు

సరిపెట్టుకున్నాను 'కౌంటర్' మీద డబ్బు లిస్తూంటే ఓ బలమైన చేయి నా భుజమ్మీదగా పడింది తిరిగి చూశాను మా వూరి సోమిరెడ్డి చిన్నల్లుడు వెంకటరెడ్డి

"ఎప్పుడొచ్చావురో రాజిరెడ్డీ! ఊరికాడ అందరూ బావున్నట్లేనా? ఏమైనా కొలువైందా యీ బొగ్గుబావిలో ?" ఊపిరాడకుండా మాట్లాడుతున్నాడు వెంకటరెడ్డి సంబరంగా

"ముందు 'చాయ్' తాగి మాట్లాడుకుందాం అంటూ వెనక్కు లాక్కెళ్ళాడు ఓ చెక్క టేబిల్‌ముందు కూచున్నాం

వెంకటరెడ్డిలో ఎంత మార్పు ముందు ఎంత ఆరోగ్యంగా వుండేవాడు! ఇప్పుడు ఎంత బలహీనంగా వున్నాడు ముఖంలో కళతప్పి వుంది చెంపలమీద ఎముకలు బయటికి పొడిచి కొచ్చేసివున్నాయి చిరుగులుపడ్డ షర్టు నల్లగా మాసివుంది నిక్కరు మీదున్నాడు రెండు ప్లేట్లు ఇడ్లీలు గారెలు ఆర్డరిచ్చాడు వెంకటరెడ్డి మా ఊళ్ళోవున్న పేరు పేరున సంగతులు చెప్పాను అయినా నా కొలువు సంగతి మాత్రం చెప్పలేక పోయాను ఊరికే అలా వచ్చానని చెప్పాను మరి నమ్మినట్లే కనిపించాడు వెంకటరెడ్డి

టిఫిన్లు వచ్చాయి తిన్నాం చాయ్ వచ్చింది తాగాం

వెంకటరెడ్డి కౌంటర్ మీదున్న ఖాతా బుక్కులో రాశాడు ఇద్దరం బయటికి నడిచాం వెంకటరెడ్డి తన సైకిల్‌స్టాండు తీసేలోగా నేను ప్రక్కనున్న బడ్డీకొట్లో ఓ సిగరెట్ ప్యాకెట్ కొన్నాను సిగరెట్ యిచ్చాను వెంకటరెడ్డికి సైకిల్ని తోసుకుంటూ వెంకటరెడ్డి "రాజిరెడ్డీ! ఇక యింటికి పోదాంపద రేపు నాకు 'ఆఫ్' వుంది మీ స్నేహితుడి గురించి రేపు కనుక్కుందాం " అన్నాడు నేను కూడ అలసిపోయాను "సరే! పద" అంటూ వెంకటరెడ్డిని అనుసరించాను దార్లో వెంకటరెడ్డి ఓ బ్రాందీ షాపుకెళ్ళి ఓ క్వార్టర్ బ్రాందీ పుచ్చుకొన్నాడు కంపెనీ వాళ్ళిచ్చిన "క్వార్టర్స్" అన్నాడు బొగ్గు పొయ్యిలతో వంట చేయడం వల్ల నల్లగా మసిబారి, పెచ్చూడిపోయిన గోడలు ఎంతో అసహ్యంగా గచ్చుపోయి గుంటలు పడ్డ నేల ఎంతో మురికిగా పైనపగిలిన సిమ్మెంటు రేకులు మొత్తంకల్సి రెండుగదులు వెంకటరెడ్డి భార్య రాఘవమ్మ మాకు దూరపుబంధువు, పిల్లలు నలుగురూను ఆ రాత్రి నేనొచ్చానని కోడి కోశారు ఆ రాత్రి విందు భోజనమే తృప్తిగా భోజనం చేశాను . వెంకటరెడ్డి మందు పుచ్చుకోవడం వల్ల ఏదేదో వాగుతున్నాడు కాని ఆరుబయటవేసిన నులక మంచంలో అలా కూలబడ్డానో లేదో మాంచి నిద్రపట్టేసింది

ఉదయం లేస్తూనే ముఖం కడుక్కున్నాక 'చాయ్' యిచ్చింది రాఘవమ్మ. ఆమె తను పడ్డ కష్టాలు... పడుతున్న బాధలు అన్నీ వివరంగా చెప్తూనే వున్నది... ఊ కొట్టూన్నానేగాని మన స్సంతా''ఆ నకిలీ రాజిరెడ్డి మీదే వుంది. ఇంతలో వెంకట్రెడ్డి నిద్రలేచాడు. కాలకృత్యాలన్నీ తీర్చుకొని 'చాయ్' గ్లాసు తెచ్చుకొని నా ముందు కూచున్నాడు... వెంకట్రెడ్డి చూపుతున్న అభిమానానికి, ఆప్యాయతకు నాకు నిజంగా .. అంటే నేను వచ్చిన పని చెప్పేయాలనిపించింది. చెప్పేశానుకూడాను...

వెంకటరెడ్డి మౌనంగా విన్నాడు

రాఘవమ్మ చపాతీలు చేసి మా ముందు పెట్టింది. అందులోనికి రాత్రి మిగిలిన కోడికూర వేసింది. శుభ్రంగా తిన్నాం ఇక వేటకు బయల్దేరాం. ''అవును రాజిరెడ్డీ! ఇక్కడ పంజేస్తున్న వాళ్ళలో చాలమంది వేరే పేరు మీదుగా వుద్యోగాలు చేస్తున్నవారే. పైరవీ కార్లకు ఏదో కొంత ముట్టజెప్తే వాళ్ళే యీ వుద్యోగాల్లో దూర్చేస్తారు కొద్దిరోజులయ్యాక మనపేర్లు మనకే గుర్తుండవు అయినా నిజంగా బాధపడేది నీలాంటి వాడు మాత్రమే. ఏమంటావ్ ?'' అంటూ దార్లో అడిగాడు ''అవును వెంకట్రెడ్డీ! కొన్ని సంవత్సరాలుగా తనకు 'కాల్ లెటర్' వస్తూందని, తనకుకూడా ఏదో ఉద్యోగమొస్తుందని, ఆశిస్తూ కాలం గడుపుతూండే మాలాంటి వాళ్ళకే యీ బాధ ఇక జీవితంలో వుద్యోగం రాదంటూ తెలిశాక మరెంత బాధ పడతాడో ? మనలాంటివాళ్ళు ఉద్యోగాన్ని సరదాకు చేయరు అవసరానికే చేస్తారు'' అంటూ నేను చెప్పాను

సైకిల్ తొక్కుతూనే వున్నాడు వెంకట్రెడ్డి. నేను 'క్యారియర్'మీద కూచుని వున్నాను ఇంకో అరగంట అయ్యాక గుడిశెలున్న ప్రదేశంలోకి చేరుకొన్నాం ఓ గుడిశె ముందు ఆగాం.

''బ్రహ్మం'' అంటూ కేకెట్టాడు వెంకటరెడ్డి. గుడిశె ప్రక్కనున్న బురదగుంటల్లోంచి ఓ బలసిన పంది మా ప్రక్క నుండి రాచుకు పోయింది. బురదగుంటలోనుంచి వస్తున్న కుళ్ళు వాసనతో ఆ ప్రదేశమంతా నిండివుంది గుడిశెముందు ఓ పెద్ద మురిక్కాలవ కంపు కొట్తోంది.

బ్రహ్మం వచ్చాడు. గుడిశె తలుపు తీసుకొని.

బ్రహ్మం మా కరణంగారి పెద్దబ్బాయి. వెంకట్రెడ్డి పక్కనున్న నన్నుచూసి ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. నోటిమాట రాకుండా అదోలా అయిపోయాడు... ''రాండి . రాండి'' అంటూ లోనికి మమ్మల్ని ఆహ్వానించాడు.

బ్రహ్మం యిక్కడేం చేస్తున్నాడో ? పాపం... గుడిశెలోనికి వెళ్ళాం.. చిరిగిన చాప

## ఒక్క క్షణం !

ఈ —
నూరేళ్ళ జీవన పోరాటంలో
నా హృదయ కవాటంలో నిక్షిప్తమై ఉన్న
గత స్మృతుల జ్ఞాపకాల పొరలు
విచ్చుకుని కలిగించే
మధురానుభూతి
ఒక్క క్షణం !

— రాణీమాలిని

వేశాడు బ్రహ్మం దానిమీద కూచున్నాం ఓ మూలగా ఓ కుక్కిమంచంలో ఓ స్త్రీ పడుకొని వున్నట్లుంది. మంచంకింద ఏవో మందుసీసాలు మాత్రలు కనిపించాయి ఒంట్లో బావున్నట్లు లేదు ఆవిడకు . ఆవిడ అంటే బ్రహ్మం ప్రేమించి, పెళ్ళి చేసుకున్న రామలక్ష్మి !

''ఏం రాజన్నా! ఊళ్ళోఅందరూ క్షేమమే కదా ? ''

''అందరూ బావున్నారు బ్రహ్మం ''

అంతకన్నా ఏం చెప్పలేకపోయాను

''మీ ఆవిడకెలావుంది బ్రహ్మం ? '' అంటూ వెంకటరెడ్డి అడిగాడు

''అలాగే వుందన్నా! నిన్న సాయంకాలం ఆస్పత్రికి వెళ్ళొచ్చాం ఎక్సరేలు తీశారు ఏ జబ్బో యింకా చెప్పలేదు. దగ్గు మాత్రం బాగా వస్తోంది. '' బ్రహ్మం చాల బాధగా చెప్తున్నాడు . ఎలావున్న మనిషి ఎలా అయిపోయాడు ఓ కలుగులో నుండి ఓ పెద్ద ఎలుక మా ముందుగా పారిపోయింది బొగ్గు పొగతో గుడిశె మట్టి గోడలు మాసి నల్లబారి వున్నాయి గుడిశె పై కప్పు మీద పరచిన బోదగడ్డి ఏ కొంచెం గాలికైనా ఎగిరిపోయేలా వుంది ఓ మూలగా చిన్న చెక్కపెట్టె అటు ప్రక్కగా చిన్న స్టవ్వు... ఓ నాలుగు సత్తుగిన్నెలు ..ఇంతనేమో ఆస్తి...

బ్రహ్మం పరిస్థితికి జాలివేస్తోంది.. అక్కణ్ణించి ఎప్పుడెప్పుడు లేద్దామాని వుంది నాకు

''చాయ్ చేసిస్తా ! తాగరూ ''

''ఇంటి దగ్గరే అన్నీ ముగించుకు వచ్చాం బ్రహ్మం . ఇప్పుడేం అక్కర్లా !''

మంచం మీద ఆవిడ కదుల్తోందేగాని లేవటంలేదు. . ''రాత్రంతా ఒక్కటే దగ్గు.. తెల్లవారేటప్పుడు అలా కళ్ళు మూసింది...'' అంటూ బ్రహ్మం మా దగ్గర్నుంచి లేచి మంచం దగ్గరకెళ్ళాడు ఆవిణ్ణి లేపుతాడేమోనని ''ఆమెను లేపకు. పడుకోనీ'' అంటూ వెంకటరెడ్డి బ్రహ్మన్ని వారించాడు

ఇంతలో బయట్నుంచి కేకలేస్తున్నారు ఎవరో ? ''ఒక్కనిముషం'' అంటూ బ్రహ్మం హడావుడిగా బయటికెళ్ళాడు

ఆ కేకకు నేను వులిక్కిపడ్డాను.

మరో రెండు నిముషాల్లో లోనికొచ్చాడు బ్రహ్మం. ఎందుకో కంగారు పడుతున్నాడు.

''ఏంటట ? ''

''అబ్బే! ఏంలేదు వెంకట్రెడ్డీ! ...''

''చెప్పవయ్యా బాబూ! ఆ కేకేసింది సత్తిగాడే కదూ ''

''అవును ''

''ఎంతడబ్బు తీసుకున్నావేంటి ? వడ్డీకి ''


''రెండొందలు ''

''చూడు బ్రహ్మం, ఆ రెండొందలు నేనిస్తాగాని వాడి ముఖాన పారేయి— అంతేగాని వాడిదగ్గర ఎప్పుడూ అప్పు తీసుకోకు. జలగ లాంటి వాడు ''

బ్రహ్మం తలొంచుకున్నాడు

''ఇక ఎల్దాం వెంకటరెడ్డీ! నేను వూరి కెళ్లిపోవాలి, వస్తా బ్రహ్మం! ఇంట్లో ఏమైనా చెప్పాలా ?'' అంటూ లేచాను

''నా గురించి ఏంచెప్పకు రాజన్నా! నీకు






# శక్తి పరీక్ష

శక్తికి మించి ఎవ్వరూ ఏ పనీ చెయ్యరు ఒకవేళ సిద్ధపడినా— దానివల్ల అనర్థమే కలుగుతుంది కాని మేలు కలగదు. పందెం వేసి శక్తికి మించి బరువెత్తితే ఎముకలు విరుగుతాయి. పంతం పట్టి అమితంగా శక్తికి మించి పదార్థాలు ఆరగిస్తే అజీర్ణ రోగం కలుగుతుంది అలాగే— ఆయుధాలు మొదలైనవి— వాటిని సరిగా ఉపయోగించే శక్తి వున్నప్పుడే వాటిని స్వీకరించాలి లేకపోతే అపాయం కలుగుతుంది.

తాము చేసుకొన్న ఒడంబడికను అనుసరించి పాండవులు పన్నెండేళ్లు వనవాసం, ఒకయేడు అజ్ఞాతవాసం చేసి తిరిగి వచ్చినా, కౌరవులు వారి వంతు రాజ్యం వారికి ఇయ్యరనీ, కౌరవ పాండవులకు యుద్ధం తప్పదనీ వ్యాసమహర్షికి తెలుసును అందువల్ల అతడు పాండవులు వనవాసంచేస్తూ ఉన్నప్పుడే వారి దగ్గిరికి వచ్చి ''మీరు మీ శత్రువులను జయించాలంటే పాశుపతం వంటి గొప్ప అస్త్రం ఉండాలి దానికోసం అర్జునుడు శివుని గురించి తపస్సు చెయ్యడం మంచిది అతడు అనుగ్రహిస్తే తప్పకుండా ఆ అస్త్రం ఇవ్వగలడు'' అని హితబోధచేసి వెళ్లిపోయాడు. ఆ మహర్షి ఉపదేశించిన ప్రకారం అర్జునుడు శివుని గురించి ఇంద్రకీలాద్రి పయి తపస్సు చేయసాగాడు ఇతని రాక చూచి, అక్కడి మునులు, తమకి మృగాల బాధ యిక ఉండదని చాలా సంతోషించారు ఆ విధంగానే అతనివల్ల వారికి రక్షణ కలిగింది.

అర్జునుడు చేసిన తపస్సు మహేశ్వరునికి తృప్తిని కలిగించింది అర్జునుడు ఎందుకు తపస్సు చేశాడో శంకరునికి తెలియును. అతడు కోరినట్లు తాను పాశుపతాస్త్రాన్ని యిస్తే— దాన్ని సక్రమంగా ఉపయోగించే శక్తి అర్జునిడికి ఉందో, లేదో! లేకపోతే అది అతనికే అపాయం కలిగించవచ్చు. అందువల్ల అతని శక్తిని పరీక్షించి మరీ యిద్దామని నిశ్చయించాడు ఆయన మూకాసురుడిని అడవి పందిగా మార్చి అర్జునిడి ఆశ్రమ ప్రాంతానికి వదిలి, తాను కిరాతుడై దాని వెనుక వచ్చాడు ఆ పంది అలజడికి అక్కడి మునులందరూ చాలా భయపడ్డారు. అర్జునుడు ఆ పందిపై ముందునుంచి బాణం వెయ్యగా, కిరాత వేషంలో ఉన్న శివుడు వెనకతట్టు బాణం ప్రయోగించాడు ఈలాగున పంది ముఖంపైని, పృష్ఠభాగంపైని వాడి బాణాలు గుచ్చుకొని, ఆ పంది గిరగిరా తిరిగి ప్రాణాలు విడిచింది ''నేను ముందు కొట్టినదాన్ని నువ్వెందుకుకొట్టావని అర్జునుడు, కిరాతుడూ కూడా ఒకరినొకరు గద్దించి ప్రశ్నిస్తూ కలహానికి దిగారు ఆ కలహం కొట్లాటగానూ, తర్వాత యుద్ధంగానూ మారింది ఇద్దరి ఆయుధాలూ భగ్నం కాగా వారు మల్ల యుద్ధం చేశారు అర్జునిడికీ, మహేశ్వరుడికీకూడ గిట్టి దెబ్బలు తగిలాయి అర్జునుడు పాశుపతాస్త్రానికి తగినవాడే అని గ్రహించి, వెంటనే నిజరూపంతో ప్రత్యక్షమయినాడు అర్జునుడికి ఆశ్చర్యం కలిగింది. తానెవ్వరి గురించి తపస్సు చేశాడో, అతనితోనే యుద్ధం చేసినందుకు భయపడి ఆ దేవదేవుని కాళ్లపై బడి, తన తప్పు క్షమించాలని ప్రార్థించాడు ''వరం కోరుకో''మ్మని అడుగగా అర్జునుడు, మహేశ్వరుడు ఊహించినట్లే పాశుపతాస్త్రాన్ని అనుగ్రహించాలని కోరాడు. శంకరుడు ప్రయోగోపసంహార రహస్యాలతో ఆ మంత్రాన్ని ఉపదేశించి, అంతర్థానమైనాడు ఆ అస్త్రం లభించడం వల్లనే అర్జునుడు యుద్ధంలో విజయం పొంది తన ''విజయు''డనే పేరును సార్థకం చేసుకున్నాడు ★

## ఫిర్యాదు

చెప్పాలని అంత ఉబలాటంగా వుంటే బ్రహ్మం పురేసుకు చచ్చాడని చెప్పు. అప్పుడు మా వాళ్లు సంతోషిస్తారు'' బ్రహ్మం కంఠంలో నుండి కరుగ్గా, కఠినంగా మాటలు దొర్లుతున్నాయి

బ్రహ్మం దగ్గర శెలవు తీసుకుని బయట పడ్డాం నేనూ, వెంకటరెడ్డీను.

''వెంకటరెడ్డీ! ఇప్పుడు మన ఊరికి బస్సుందా ?''

''నీవు వచ్చిన పని అయిపోయిందా ?''

''ఇంకోసారి వస్తాగానీ! ఇంటి దగ్గర ఓ అర్జంటు పనుంది''

''తప్పదా ?''

''తప్పదు నన్ను బస్టాండులో వదిలేయి''

''అలాగే!''

మరో పది నిముషాల్లో బస్టాండులో వున్నాం మా వూరి బస్సు బయల్దేరేందుకు సిద్ధంగా వుంది బస్సులో కూడ జనం లేరు

''ఇక నేవస్తా! వెంకటరెడ్డీ! .'' అంటూ సీట్లో కూచున్నాను కిటికీ వైపు. వెంకటరెడ్డి నా చేతుల్ని గట్టిగా పట్టుకుని వదిలాడు .. ఆ స్పర్శలో ఎంత ఆప్యాయత వుంది నా మంచి తనాన్ని పసిగట్టినట్లుంది బస్సు బయల్దేరింది

నేను వచ్చిన పనేమిటి? ఏమయింది నాకు?

బ్రహ్మం మా వూరి కరణంగారి రెండో అబ్బాయి. కలవారి అబ్బాయి బి ఏ వరకు చదివాడు అభ్యుదయభావాలుకలవాడు మావూరి కొండయ్యకూతుర్ని, ప్రేమించి ఏకంగా ఎవ్వరికీ చెప్పకుండా పెళ్ళి చేసుకుని తన యింటికి తీసుకొచ్చాడు కరణంగారు అగ్గయ్యారు వూరు పెద్దలంతా ఆజ్యం పోశారు కరణంగారు తన కొడుకును, కోడల్ని తన్ని తగలేశారు ఆ రోజు రాత్రే కొండయ్య గుడిశె బుగ్గిపాలయింది ఆ మంటల్లోనే కొండయ్య కుటుంబం మసయ్యారు. ఆ సంఘటన కల్గించిన ఏహ్యాభావంతో బ్రహ్మం ఆ వూరు వదిలాడు .. ఎక్కడో రిక్షా తొక్కుకొని బ్రతుకుతున్నాడని తెల్సింది మాకు అప్పట్లో . కాని ఇప్పుడు. . ఇక్కడ బొగ్గు బావుల్లో పంజేస్తున్నాడు.. రామలక్ష్మి అంటే బ్రహ్మం భార్యకు క్షయట .. ఇన్ని బాధలు పడుతున్న బ్రహ్మం . నాకంటే అతి బీదవాడు కాదా ?. . బ్రహ్మనికి... అతడి ఆశయాలకు జోహార్లర్పించాను.. కాని. నా జీవితంమీద బ్రహ్మం అభ్యుదయ భావాల ప్రభావం ఏర్పడిందే ? మరి . నే నెవరికి ఫిర్యాదు చేయాలి ? ఫిర్యాదు చేస్తే బ్రహ్మం బతుకు... భార్య ఆరోగ్యం... ఉహూ.. నా కేం తక్కువయింది ? రెండెకరాల పొలం . గుండెల్లో బలం .? చాలు.. నా సంసారాన్ని పోషించేందుకు !

బ్రహ్మం . అదే నకిలీ రాజిరెడ్డి... వడ్డీల సత్తిగాడు ''రాజిరెడ్డి . రాజిరెడ్డి'' అని బ్రహ్మం గుడిశెముందు నిలబడి కేకేయకుంటే నా దర్యాప్తుకు ముగింపు యిప్పట్లో వుండేది కాదు. . మరి !

అయినా ఫిర్యాదు ఎవరిమీద చేయాలి ? ఏ వ్యవస్థమీద ? ★